సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 19 । మే । 2024

విరగ్గాసిన పనస



సాక్షి,పాడేరు: మన్యంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున పనస విరగ్గాసింది. గిరిజనుల్లో ఆనందం నెలకొంది.



ఘనంగా తులసీదళార్చన

విశాఖ: నగరంలోనిబురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు.



వేడుకగా కల్యాణం

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు వెంకన్న కల్యాణ మహోత్సవం



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

అరకులోయ టౌన్: పట్టణంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 19న కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు అప్పలరామ్, రామారావు తెలిపారు. భక్తులు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహించ తలపెట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున వచ్చేనెల నెల 15 తరువాత నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని వారు కోరారు.

ఏపీ జెన్‌కో డైరెక్టర్ విస్తృత పర్యటన



గుంటవాడ డ్యామ్ గేట్లను పరిశీలిస్తున్న డైరెక్టర్

సీలేరు: ఏపీజెన్‌కో డైరెక్టర్ ఎంవీ సత్యనారాయణ శనివారం సీలేరు కాంప్లెక్స్‌లో విస్తృతంగా పర్యటించారు. పంపు స్టోరేజీ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం గుంటవాడ డ్యామ్, సీలేరు జల విద్యుత్ కేంద్రానికి నీరందించే రెగ్యులేటర్ డ్యామ్ గేట్లను పరిశీలించారు. గేట్ల పనితీరుపై ఆయా సివిల్ అధికారుల నుంచి తెలుసుకున్నారు.అక్కడ నీటి నిల్వలను పరిశీలించారు. గేట్ల నుంచి నీరు లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పవర్‌హౌస్‌లో నాలుగు యూనిట్ల పనితీరును తెలుసుకున్నారు. ఇటీవల ఒకటో యూనిట్ నిలిచిపోవడానికి కారణాలపై ఆరా తీశారు. చీఫ్ ఇంజనీరు బి.శ్రీధర్, సూపరింటెండెంట్ ఇంజనీరు కె.వి. ప్రశాంత్‌కుమార్, చంద్రశేఖర్ రెడ్డి (పంపు స్టోరేజి) ఇన్‌చార్జ్ ఎస్‌ఈ బాలకృష్ణ ,ఈఈలు ప్రభాకర్,రాజేంద్రప్రసాద్, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

సివిల్స్ విజేత నరేంద్రపడాల్‌కు సత్కారం



సివిల్స్ విజేత నరేంద్రపడాల్‌ను సత్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: సివిల్స్‌లో 545 ర్యాంకు సాధించిన నరేంద్రపడాల్ గిరిజన యువతకు ఆదర్శంగా నిలిచాడని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. సివిల్స్ విజేత నరేంద్ర పడాల్‌కు ఆయన స్వగ్రామమైన హుకుంపేట మండలం అండిభ గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో శాలువా కప్పి పూల మాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్స్ విజేత నరేంద్రపడాల్‌ను గిరిజన యువతీయువకులంతా ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానంలో నిలవాలని కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ఓకుర్తి గ్రామంలో దగ్ధం అవుతున్న తాటాకిల్లు

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి పంచాయతీ, ఓకుర్తి గ్రామంలో శనివారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో కుడుముల భాస్కర్రావుకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. విద్యుత్ మీటర్ నుంచి వచ్చిన నిప్పురవ్వల కారణంగా ప్రమాదం చోటుచేసుకుంది. ఇంట్లోని దుస్తులు, నిత్యావసర వస్తువులు, ఫర్నిచర్, వరి ధాన్యం, బియ్యం వంటి ఆహారపదార్థాలు, విలువైన డాక్యుమెంట్లు కాలిపోయాయి. బాధితులు బోరున విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

గిరి రైతులకు వెన్నుదన్నుగా..

రంపచోడవరం ఐటీడీఏ గిరి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. దీనిలో భాగంగా ఉద్యానవన పంటలను ప్రోత్సహించేందుకు ప్రణాళికపరంగా చర్యలు చేపట్టింది. రైతులకు పంపిణీ చేసేందుకు రంపచోడవరం హార్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్, ఉద్యానవన పరిశోధన స్థానంలో జీడిమామిడి, మామిడి తదితర అంటుమొక్కలను సిద్ధం చేసింది.

- రంపచోడవరం ఐటీడీఏ కార్యాచరణ
- ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంపునకు కసరత్తు
- 200 హెక్టార్లలో జీడిమామిడి సాగుకు ప్రణాళిక
- పంపిణీకి లక్ష జీడిమామిడి అంటు మొక్కలు సిద్ధం



హార్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్‌లో రైతులకోసం సిద్ధం చేసిన జీడిమామిడి అంటుమొక్కలు



పందిరిమామిడిలో అంటు మొక్కలు

రంపచోడవరం: ఏజెన్సీలో గిరి రైతులకు మంచి ఆదాయం ఇచ్చే తోట పంటల్లో జీడిమామిడి సాగు ప్రధానం. ఈ తోటలను మరింత విస్తరించి గిరి రైతులకు ఆర్థిక ఆసరా కల్పించేలా రంపచోడవరం ఐటీడీఏ కార్యాచరణ రూపొందించింది. ఉద్యాన మిషన్ పథకంలో జీడిమామిడి పెంచిన అంటు మొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా గిరిజన రైతులకు అందజేసేందుకు పీవో సూరజ్ గనోరే చర్యలు చేపట్టారు. ఈ ఏడాది రైతులతో 200 హెక్టార్లలో జీడిమామిడి అంటుమొక్కలు నాటేలా ఏర్పాట్లు చేశారు. రంపచోడవరంలోని హార్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్‌లో 50 వేలు, పందిరిమామిడి ఉద్యానవన పరిశోధన స్థానంలో మరో 50 వేల జీడిమామిడి మొక్కలను పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. ఉచితంగా మొక్కలు పంపిణీ చేసిన రైతులకు నిర్వహణ నిమిత్తం ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి పోత్సహిస్తున్నారు.

మామిడి అంటుమొక్కలు కూడా..

ఈ ఏడాది తొలిసారిగా రైతులకు పంపిణీ చేసేందుకు హార్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్‌లో 4వేల మేలు జాతి మామిడి మొక్కలను సిద్ధం చేస్తున్నారు.

- రెడ్‌లేడీ బొప్పాయి రకానికి చెందిన 1500 మొక్కలను ఉచితంగా ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

జాఫ్రా సాగుకు ప్రోత్సాహం

ఈ ఏడాది జాఫ్రాకు మంచి ధర పలకడంతో గిరి రైతులు అందుకు తగ్గట్టుగా ఆదాయం పొందారు. ఈ సాగును పోత్సహించే దిశగా రంపచోడవరం ఐటీడీఏ చర్యలు చేపట్టింది. రైతులకు పంపిణీ చేసేందుకు పదివేల జాఫ్రా మొక్కలను సిద్ధం చేసింది.

జీడిమామిడి సాగుపై ఆసక్తి

ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం 50 వేల ఎకరాల్లో జీడిమామిడి తోటలు ఉన్నాయి. ఎకరానికి సుమారుగా 300 కేజీల జీడిమామిడి పిక్కలు దిగుబడి వస్తోంది. ముదురు తోటల్లో దిగుబడి తగ్గడంతో రైతులు కొత్త మొక్కలను నాటుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

మార్కెటింగ్‌పై ఐటీడీఏ దృష్టి

గిరిజన రైతుల పండించే ఉత్పత్తుల మార్కెటింగ్‌పై ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే దృష్టి సారించారు. ఈ ఏడాది జాఫ్రాకు ధర నిర్ణయించడంతో గిరిజన రైతులకు మేలు జరిగింది. జీడిమామిడికి గిట్టుబాటు ధర కల్పించే దిశగా చర్యలు చేపట్టారు.

ప్రాసెసింగ్ యూనిట్లకు దరఖాస్తుల స్వీకరణ

ఈ ఏడాది మండలాల వారీగా జీడిమామిడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ విలువ రూ. 10 లక్షలు.. లబ్ధిదారులు రూ.5 లక్షలు చెల్లిస్తే మిగిలిన సొమ్ము బ్యాంకు రుణం ఇప్పించేలా కార్యాచరణ రూపొందించారు. తద్వారా రైతులకు ఆదాయ మార్గాలు అందుబాటులో తేవాలన్న లక్ష్యంతో ఐటీడీఏ ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటోంది.

'ఉపాధి' కొనసాగించాలి



ఏజెన్సీలో గిరిజనులు జీడిమామిడి సాగు ఎక్కువగా చేస్తారు. రైతులకు మంచి దిగుబడిని ఇచ్చే రకాలు సరఫరా చేయాలి.గతంలో ఉపాధిహామీ పథకంలో మొక్కలు నాటుకునేందుకు, వాటిని రెండేళ్ల పాటు నీరుపోసి సంరక్షించుకునేందుకు ఉపాధి వేతనం ఇచ్చే వారు.అదే కొనసాగిస్తే రైతులకు మేలు జరుగుతుంది. – పండా కుమారి, పోక్సుపేట

అంటు మొక్కలు సిద్ధం



వర్షాకాలంలో రైతులు నాటుకునేందుకు జీడిమామిడి మొక్కలను సిద్ధం చేశాం. దీనిలో భాగంగానే హార్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్‌లో 50వేల అంటు మొక్కలను ఉత్పత్తి చేశాం ఉపాధి హామీ పథకం అనుసంధానంతో మొక్కలు పెంచుకోవచ్చు. అలాగే నర్సరీలో రూ. 40 చెల్లించి రైతులు మొక్కలు పొందవచ్చు.
– చిట్టిబాబు, హెచ్‌వో, రంపచోడవరం ఐటీడీఏ

సత్వరంగా నాడు–నేడు పనులు

డీఈవో బ్రహ్మాజీరావు ఆదేశం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

చింతపల్లి రూరల్: పాఠశాలల పునః ప్రారంభం నాటికి నాడు– నేడు పనులు పూర్తి చేయాలని డీఈవో బ్రహ్మాజీరావు ఆదేశించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన ఎంఈవోలు, హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. జూన్ నాటికి పాఠశాలలు ప్రారంభం అవుతాయని అప్పటిలోగా మధ్య దశలో ఉన్న నాడు నేడు పనులను పూర్తి చేయడమే కాకుండా విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి,గూడెంకొత్తవీధి మండల విద్యాశాఖ అధికారులు పనసల ప్రసాద్, తగ్గి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



పాడేరులో వాసవీమాత చిత్రపటానికి పూజలు చేస్తున్న పాడేరు వాసవీ క్లబ్ ప్రతినిధులు



వాసవీమాత విగ్రహం వద్ద పూజలు చేస్తున్న వాసవీ హిల్స్ క్లబ్ మహిళా ప్రతినిధులు

సాక్షి,పాడేరు: వాసవీమాత జయంతిని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి వాసవీక్లబ్, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులంతా ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘ ప్రతినిధులు ఉడా త్రినాథరావు, సత్యవరపు సోమరాజు, ఉప్పల వెంకటరత్నం, డి.అప్పలరాజు, వీర్రాజు పాల్గొన్నారు. అలాగే వాసవీ హిల్స్ క్లబ్, వనితా హిల్స్ క్లబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో వాసవీమాత విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆర్యవైశ్య మహిళలంతా కుంకుమార్చన నిర్వహించిన ప్రసాదాలు పంచిపెట్టారు.

ఇంటర్ అడ్వాన్స్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు
- పరీక్షలు రాయనున్న 39,997 మంది విద్యార్థులు
- జిల్లాలో 49 కేంద్రాల ఏర్పాటు




ఆర్‌ఐవో మురళీధర్

విశాఖ విద్య : ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్‌ఐవో పి.మురళీధర్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు ఉన్న 172 జూనియర్ కాలేజీల నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం జనరల్ కోర్సులకు 31,142 మంది, ఒకేషనల్ కోర్సులకు 626 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. అదే విధంగా సెకండ్ ఇయర్ జనరల్ కోర్సులకు 7,774 మంది, ఒకేషనల్ కోర్సులకు 455 మంది విద్యార్థులు హాజరతున్నారన్నారు. ఇందుకు జిల్లాలో 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు సంబంధించిన సామగ్రి ఇప్పటికే జిల్లాకు చేరుకుందన్నారు. తగిన పోలీసు బందోబస్తు మధ్య జిల్లాలో గుర్తించిన 11 స్టోరేజ్ పాయింట్లులో వీటిని భద్రపరిచామన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 1 వరకు రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అదే విధంగా రెండో సంవత్సరం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు.

అద్భుతం





మన్యంలో ప్రకృతి అందాలకు కొదవలేదు. సీజన్ ఏదైనా ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తుంటాయి. మండలంలోని మర్రగుడ సమీపంలోని చాపరాయి వద్ద శనివారం అద్భుతమైన ప్రకృతి దృశ్యం ఆవిష్కృతమైంది. ఆకుపచ్చని అందాలమధ్య మేఘాలు కనువిందు చేస్తూ ప్రకృతి ప్రేమికులను కట్టిపడేశాయి. – అనంతగిరి

మన్యంలో భారీ వర్షం



పాడేరులో కురుస్తున్న వర్షం



అనంతగిరిలో మధ్యాహ్నం కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: మన్యంలో శనివారం సాయంత్రం సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రత నెలకొన్నప్పటికి మధ్యాహ్నం మూడు గంటల తరువాత వాతావరణం చల్లబడింది. ఖరీఫ్ సాగుకు ఎంతో ఉపయోగమని గిరి రైతులు తెలిపారు. ఇప్పటికే వేసవి దుక్కులు, మెట్ట వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

అనంతగిరిలో భిన్న వాతావరణం

అనంతగిరి: ఒకవైపు ఎండతీవ్రత, మరోవైపు భారీ వర్షంతో శనివారం భిన్నమైన వాతావరణం నెలకొంది. మండలంలో ఉదయం నుంచి ఎండ ఎక్కువగానే ఉండగా, మధ్యాహ్నానికి వాతావరణం ఒక్కసారిగా మారి వర్షం కురిసింది. మూడు రోజులుగా మండలంలో ఇలా విభిన్నమైన వాతావరణం చోటు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో వర్షాలు పడుతుండడంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సీలేరులో కురుస్తున్న వర్షం

సీలేరులో..

సీలేరు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు సీలేరులో ఆదివారం మధ్యాహ్నం నుంచి సుమారు మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతకు అల్లాడిన ప్రజలు వర్షం కారణంగా వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. దారకొండ, దుప్పులవాడ, చల్లనిశిల్ప ప్రాంతాల్లో కూడా వర్షం కురిసింది.

సింహగిరికి ఎలక్ట్రిక్ బస్సు సర్వీసు

- ప్రారంభించిన దేవస్థానం చైర్మన్ అశోక్ గజపతిరాజు
- రూ.1.65 కోట్లతో కొనుగోలు
- 18 లక్షలతో చార్జింగ్ పాయింట్ ఏర్పాటు పనులు
- త్వరలో రానున్న మరో బస్సు



బస్సుకు పూజలు నిర్వహిస్తున్న అశోకగజపతిరాజు, ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : సింహగిరి ఘాట్‌రోడ్డులో ఎలక్ట్రిక్ బస్సు సర్వీసును శనివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రారంభించింది. దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో బస్సుకు అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఆయనతో పాటు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, పలువురు ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు రెండో టోల్‌గేట్ ద్వారా సింహగిరికి బస్సులో తరలివెళ్లారు. ఈసందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ భక్తులే భగవంతునికి నిజమైన ప్రతినిధులని, భగవంతుడికి ఇచ్చిన విరాళాలు వృథా చేయకూడదని, భక్తుల సౌకర్యాల కోసం ఖర్చు చేస్తే హర్షిస్తాడన్నారు. భగవంతుడు ఇచ్చిన సృష్టిని భావితరాలకు అందించాలన్నారు. పర్యావరణ పరిక్షణలో భాగంగా దేవస్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ సింహగిరి ఘాట్‌రోడ్డులో రెండు ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని నిర్ణయించామని. తొలుత రూ.1.65 కోట్లతో కొనుగోలు చేసిన బస్సును ప్రారంభించామన్నారు. మొత్తం 42 సిట్టింగ్ కెపాసిటీ, స్టాండింగ్ కెపాసిటీ 30 ఉంటుందన్నారు. రెండున్నర గంటలు చార్జ్‌చేస్తే 225 కిలోమీటర్లు ప్రయాణించవచ్చన్నారు. టికెట్టు రూ.15గా నిర్ణయించామన్నారు. రెండో బస్సు కొనుగోలుకు కూడా ఇప్పటికే 50శాతం నగదును చెల్లించినట్టు చెప్పారు. అతిత్వరలోనే ఆ బస్సు కూడా దేవస్థానానికి రానుందన్నారు. రూ.18 లక్షలతో 18కేవీ కెపాసిటీతో శ్రీకృష్ణాపురం గోశాలలోనే చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం కంపెనీ సమకూర్చిన అనుభవజ్ఞులైన డ్రైవర్లతో బస్సును నడుపుతున్నామని చెప్పారు. దేవస్థానం డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నామని, శిక్షణ అనంతరం వారే ఎలక్ట్రికల్ బస్సులు నడుపుతారని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, డీఈ హరిరాజు, ఏఈ గోవర్దన్, సూపరింటెండెంట్లు యనమండ్ర అప్పారావు, సునీల్, సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్యలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- ఈనెల 25 వరకు గడువు
- కన్వీనర్ శ్రీపాద రామకృష్ణ



వై.రామవరం: ఏకలవ్య పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈపీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏకలవ్య కన్వీనర్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. 2024 మార్చిలో సీబీఎస్‌ఈ సబ్జెక్టుల్లో 10వ తరగతి, మరియు ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థిని, విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

- వై.రామవరం మండలం పి.ఎర్రగొండ ఏకలవ్య పాఠశాలలో 13 మంది బాలికలకు, మారేడుమిల్లి ఏకలవ్యలో 18 మంది బాలికలకు, 16 మంది బాలురకు, రాజవొమ్మంగి ఏకలవ్యలో 15 మంది బాలికలు, 16 మంది బాలురు, చింతూరు ఏకలవ్యలో 16 మంది బాలికలు, 16మంది బాలురకు, మొత్తం 48 సీట్లు బాలురకు, 62 సీట్లు బాలికలకు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9490876026 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

జి.మాడుగుల: ఏకలవ్య కళాశాలలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పారయ్య సూచించారు. గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంచలేదని ఆయన పేర్కొన్నారు.

సాక్షి మైత్రి మహిళ — బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి జూన్ 24వ తేదీ వరకు బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికేట్లు అందజేయబడతాయి.

శిక్షణలో నేర్పించే అంశాలు :

1. థ్రెడ్డింగ్, 2. వ్యాక్స్, 3 పెడిక్యూర్, 4. మెనిక్యూర్, 5. బ్లీచింగ్, 6. స్కిన్ కేర్, 7. హెయిర్ కేర్, 8. వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, 9. డ్యాండ్రఫ్ ట్రీట్‌మెంట్, 10. హెయిర్ ఫాల్ ట్రీట్‌మెంట్, 11. హెయిర్ కట్స్, 12. హెయిర్ స్టైల్స్, 13. హెన్నా ప్రిపరేషన్ 14, డై అప్లికేషన్, 15. మేకప్స్ (బ్రైడల్, పార్టీ మరియు లైట్ మేకప్స్) 16. పింపుల్ ట్రీట్‌మెంట్, 17. హెయిర్ మసాజ్, 18. కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, 19. ఫేషియల్స్, 20. సారీ డ్రాపింగ్.

రిజిస్ట్రేషన్స్ స్వీకరించు తేదీలు : 17-5-2024 నుంచి 26-5-2024 వరకు
సమయం : ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు
ఫీజు : 3000/-
వర్క్‌షాపు షెడ్యూలు తేదీలు : 27-05-2024 నుంచి 24-06-2024 వరకు
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు

రిజిస్ట్రేషన్ మరియు శిక్షణా స్థలం :

వనితశ్రీ బ్యూటీ ఇన్‌స్టిట్యూట్

బాలాజీ హిల్ వ్యూ ఎన్‌క్లేవ్, వేపగుంట, గోశాల, బి.ఆర్.టి.ఎస్.రోడ్, విశాఖపట్నం

సంప్రదించవలసిన నంబర్లు : 70757 09205, 91001 73200

క్లుప్తంగా

రంపచోడవరంలో పుష్ప-2 షూటింగ్ సందడి

రంపచోడవరం: పుష్ప -2 సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను శనివారం స్థానిక జూనియర్ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్, స్థానిక మార్కెట్ ప్రాంతంలో చిత్రీకరించారు. జూనియర్ కళాశాల వద్ద టెలిఫోన్ బూత్ సెట్టింగ్ ఏర్పాటు చేశారు. సంత మార్కెట్ వద్ద గిరిజనులు సంతలో వస్తువులు కొనుగోలు చేస్తున్న సన్నివేశాలను చిత్రీకరించారు.

23న ఆర్టీసీ పార్శిల్ విభాగం బహిరంగ వేలం

దాబాగార్డెన్స్: ఏపీఎస్ఆర్టీసీ విశాఖపట్నం పార్శిల్ ఆఫీస్‌లో అన్‌క్లయిమ్డ్, అన్ ఐడెంటిఫైడ్ వస్తువులకు ఈ నెల 23న బహిరంగ వేలం వేయనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ పార్శిల్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న వేలంలో ఆసక్తి గలవారు పాల్గొనవచ్చని తెలిపారు.

బాలల సంక్షేమానికి కృషి

ఆరిలోవ: బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. పైనాపిల్‌కాలనీలో జిల్లా మహిళా కేంద్రంలో శనివారం ఆరు జిల్లాల స్త్రీ సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్లు, జిల్లాల బాలల సంరక్షణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్జేడీ జి.చిన్మయిదేవి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో ఎస్సీపీసీఆర్ చైర్మన్‌తో పాటు సభ్యుడు గొండు సీతారాం పాల్గొని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఇంతవరకు నమోదైన బాల్య వివాహాలు, పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, గ్రామ స్థాయిలో వాటి నిర్మూలనకు ఏర్పాటు చేసిన కమిటీలు తదితర రికార్డులు పరిశీలించి, చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. సమీక్షలో ఆయా జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి తరలిస్తున్న ఇద్దర్ని గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు... జీఆర్పీ, ఆర్పీయఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్‌ల ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో వివిధ ప్లాట్‌ఫారాలు తనిఖీలు నిర్వహించారు. బీహార్ రాష్ట్రం పాట్నా జిల్లాకు చెందిన సూరజ్‌కుమార్ విశాఖ మీదుగా చెన్నై తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రూ.80 వేలు విలువ గల 16కేజీల గంజాయిని కనుగొని స్వాధీనం చేసుకొన్నారు. మరో తనిఖీలలో భాగంగా ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన ప్రదీప్ మల్లిక్ అనే వ్యక్తి విశాఖ మీదుగా సుమారు రూ.54,500 విలువైన 10.9కేజీల గంజాయిని తరలిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకొన్నారు. ఇద్దర్ని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

సింహగిరి కిటకిట


సింహగిరి ఘాట్‌రోడ్డులో వాహనాల రద్దీ

- దర్శనానికి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- ఘాట్‌రోడ్డులో భారీగా నిలిచిపోయిన వాహనాలు
- కొండదిగువ పెద్ద ఎత్తున ట్రాఫిక్‌జామ్
- ఒక్కరోజు రూ. 53 లక్షల ఆదాయం
- రాత్రి 7.15గంటల్లోపు 42వేల మంది భక్తుల స్వామిదర్శనం


కొండదిగువ తొలిపావంచా ఏరియాలో వాహనాల రద్దీ

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. భక్తులతో దర్శన క్యూలు కిక్కిరిశాయి. మాడ వీధులన్నీ భక్తులతో నిండిపోయాయి. అన్నప్రసాద భవనం, ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల వద్ద భక్తులు బారులు తీరాయి. భక్తుల రద్దీ కారణంగా అంతరాలయ దర్శనాలు రద్దు చేశారు. కేవలం నీలాద్రిగుమ్మం వద్ద నుంచే దర్శనాలు కల్పించారు. మరోపక్క సింహగిరిపై వాహనాల పార్కింగ్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ద్విచక్రవాహనాలు, కార్లు ఎక్కువగా రావడంతో పార్కింగ్ ప్రదేశాలన్నీ నిండిపోయాయి. దీంతో ఎక్కడ వాహనాన్ని పార్క్ చేయాలో తెలియక భక్తులు తికమకపడ్డారు. గజపతి సత్రం మార్గంలోను, మైక్రో టవర్‌కు వెళ్లే మార్గంలో భారీ ఎత్తున వాహనాలను పార్క్ చేశారు. అలాగే సింహగిరి ఘాట్‌రోడ్డులో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకుంది. దీనికి తోడు ఒక కారు ఘాట్‌రోడ్డులో మరమ్మతుకు గురై నిలిచిపోవడంతో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. ట్రాఫిక్ పోలీసులు వెంటనే నిలిచిపోయిన కారును పక్కకు తీసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అలాగే రెండో టోల్‌గేట్ ప్రవేశ ద్వారం వద్ద కూడా పెద్ద ఎత్తున వాహనాల రద్దీ నెలకుంది. కొండదిగువ తొలిపావంచా ఏరియా అంతా పెద్ద ఎత్తున వాహనాలతో నిండిపోయింది.

దేవస్థానానికి రూ.53 లక్షల ఆదాయం

శనివారం సాయంత్రానికి దేవస్థానానికి సుమారు రూ.53లక్షల ఆదాయం లభించింది. దర్శనాల టికెట్ల విక్రయం ద్వారా రూ.33లక్షలు, ప్రసాదాల విక్రయం ద్వారా సుమారు రూ.13 లక్షలు, కేశఖండనశాల ద్వారా రూ.5.29లక్షలు, సేవల ద్వారా రూ.93వేలు, విరాళాల రూపంలో సుమారు రూ.80వేలు వచ్చింది. రాత్రి 7.15 సమయానికి 42వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

రెండో విడత చందనం అరగదీత ప్రారంభం


చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో శనివారం నుంచి రెండో విడత చందనం అరగదీత ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 23న వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని ఆరోజు తెల్లవారుజామున స్వామికి సమర్పించనున్న మూడు మణుగుల పచ్చిచందనం (120 కిలోలు) సమకూర్చేందుకు అరగదీత కార్యక్రమం చేపట్టారు. ఉదయం 7 గంటలకు చందనం చెక్కలకు పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ భాండాగారం వద్ద బేడామడంపంలో 20 మంది సిబ్బంది అరగదీతని శాస్త్రోక్తంగా ప్రాంభించారు. తొలిరోజు 40 కిలోల చందనాన్ని అరగదీశారు. ఈ చందనాన్ని అర్చకులు తూకం వేసి భద్రపరిచారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఏఈవో ఆనంద్‌కుమార్ పర్యవేక్షించారు. కాగా ఏడాదిలో నాలుగు సార్లు మూడు మణుగుల చొప్పున పచ్చి చందనాన్ని సమర్పిస్తారు. చందనోత్సవం రోజు రాత్రి, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ఠ పౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి రోజు చందనం సమర్పణ జరుగుతుంది. ఈనెల 10న జరిగిన చందనోత్సవం రోజు తొలివిడత చందన సమర్పణ చేశారు. రెండో విడతగా ఈనెల 23న వైశాఖ పౌర్ణమి రోజు చందనాన్ని సమర్పించనున్నారు.

మరికొన్ని ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: వేసవి సీజన్‌లో రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం మరికొన్ని ప్రత్యేక రైళ్లు ఆయా మార్గాలలో నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

- సంబల్‌పూర్-కాచిగూడ(08325) సమ్మర్ స్పెషల్ సంబల్‌పూర్‌లో ప్రతీ సోమవారం రాత్రి 9 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.20 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.25 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 9.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 24వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కాచిగూడ-సంబల్‌పూర్(08326) సమ్మర్ స్పెషల్ కాచిగూడలో ప్రతీ మంగళవారాలలో రాత్రి 11.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.35 గంటలకు బయల్దేరి బుధవారాలలో రాత్రి 11.45 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది.
- సంబల్‌పూర్-బెంగళూరు(08321) సమ్మర్ స్పెషల్ ప్రతీ గురువారాలలో సాయంత్రం 6.45 గంటలకు సంబల్‌పూర్‌లో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 27వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో బెంగళూరు-సంబల్‌పూర్(08322) సమ్మర్ స్పెషల్ ప్రతీ శనివారాలలో తెల్లవారు 1.15 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 29వ తేదీ వరకు నడుస్తాయి.

హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

అంబాలా డివిజన్, శంభు స్టేషన్ పరిధిలో జరుగుతున్న రైతుల ఆందోళనల నేపథ్యంలో ఈ మార్గంలో ప్రయాణించే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 21వ తేదీన విశాఖలో బయల్దేరే విశాఖపట్నం-అమృత్‌సర్ (20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో 22వ తేదీన అమృత్‌సర్‌లో బయల్దేరే అమృత్‌సర్-విశాఖపట్నం (20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించబడిన మార్గంలో వయా జఖల్, దూరి, లూధియానాల మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ప్రాణం తీసిన ఈత సరదా


పవన్ మృతదేహం

పెందుర్తి : మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు స్నేహితులతో కలిసి వెళ్లిన ఓ యువకుడు నీట మునిగి మృతి చెందాడు. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సీతంపేటకు చెందిన సుర పవన్(22) స్నేహితులతో కలిసి శనివారం ఉదయం ఈతకు వచ్చాడు. మేహాద్రిలో దిగిన తరువాత పవన్ ఆకస్మాత్తుగా నీట మునిగిపోయాడు. సాయంత్రం పవన్ మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతుంది.

గ్రూప్స్-2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీలోని సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్-2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ అందించనున్నారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన బీసీ, ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు శిక్షణకు అర్హులని స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎస్.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రెండు నెలల పాటు సాగే శిక్షణకు 60 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు స్టైఫండ్‌తో పాటు స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఎంవీపీ కాలనీలోని సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో అందజేయాలన్నారు. వివరాలకు 9492569177 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వసూళ్లపై విజిలెన్స్ ఆరా!

- భద్రతపై బాధ్యతగా వ్యవహరిస్తున్నాం..
- వసూళ్లపై దృష్టిసారిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
- ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ అధికారులు

సాక్షి, విశాఖపట్నం : విద్యుత్ కనెక్షన్ల మంజూరులో వసూళ్ల పర్వానికి పాల్పడుతున్న వైనంపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. గతేడాది కాలంగా ఎక్కడెక్కడ ఎన్ని వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశారో.. దానికి సంబంధించిన వివరాలను విజిలెన్స్ సేకరిస్తోంది. ఉమ్మడి విశాఖలో తరచుగా జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలపై 'సమన్వయ లోపంతో షాక్' శీర్షికన శనివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై విజిలెన్స్ దృష్టిసారించింది. మరోవైపు కథనంపై ఈపీడీసీఎల్ సర్కిల్ అధికారులు స్పందిస్తూ విద్యుత్ భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు. అదేవిధంగా సబ్బవరం, ఇతర మండలాల్లో రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బందిపై దృష్టిసారిస్తున్నామని, బాధ్యులపై చర్యలకు ఉపక్రమిస్తామని ఎస్ఈ మహేంద్రనాథ్ అన్నారు. రెండు నెలల కాలంలో జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన హెల్పర్స్.. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మరమ్మతులు చేపట్టేందుకు వెళ్లడం వల్ల దురదృష్టకరమైన ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఈ విషయంలో మిగిలిన వారందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈ తెలిపారు. అదేవిధంగా కశింకోట డివిజన్ పరిధిలో ప్రతి చోటా వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలు పంపిణీ చేస్తున్నామని డివిజన్ ఈఈ రామకృష్ణ తెలిపారు. విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని వివరించారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.15.31 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 23 రోజులకు రూ.15,31,839 లక్షలు, వెండి 171 గ్రాములు, యూఎస్ఏ డాలర్లు 90, సింగపూర్ డాలర్లు 10, ఎస్‌బీఐ చెక్కు రూ.111 వచ్చినట్లు ఆలయ ఉప కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారిని ఎస్.సుజాత తెలిపారు. దేవాదాయ శాఖ తనిఖీదారులు, డిప్యూటీ కమిషనర్ అండ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.యు.డి.ఎన్ ప్రసాద్, బి.వసంత కుమార్, ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.చోళన్, వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో చురుగ్గా పూడిక తీత


పొక్లెయిన్‌తో ఏలేరు కాలువలో పూడిక తొలగిస్తున్న సిబ్బంది


పూడిక తీశాక నిండుగా ప్రవహిస్తున్న నీరు

నాతవరం: ఏలేరు కాలువలో పూడిక తీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే కాలువలో నీటి ప్రవాహం పెరగడంతో పాటు నీటి వృథాకు అడ్డుకట్టపడుతుంది. కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి 154 కిలోమీటర్ల పొడవున గల ఏలేరు కాలువ ద్వారా ప్రతి రోజు 300 క్యూసెక్కుల చొప్పున విశాఖపట్నానికి నీటిని తరలిస్తున్నారు. దీనిని ప్రజల తాగునీటి అవసరాలతో పాటు పలు పరిశ్రమలకు వినియోగిస్తున్నారు. ఈఏడాది కాలువలో పూడిక తొలగింపుతో పాటు పలు చోట్ల మరమర్మతుల కోసం ప్రభుత్వం రూ.4కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను వచ్చే నెలాఖరులోగా లోపు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఏలేశ్వరం రిజర్వాయర్ అధికారులు, విశాఖపట్నం జీవీఎంసీ అధికారులు సంయుక్తంగా గత నెల పనులు ప్రారంభించారు. ప్రస్తుతం 100 కిలో మీటర్లకు పైగా పూడిక తీశారు. పూడిక తీత పనులతో పాటు ఏలేరు కాలువ గట్లపై ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించి, మరమర్మతులు చేపడుతున్నారు. ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా ప్రతి రోజు 300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తే పూడిక తీయక ముందు విశాఖపట్నానికి కేవలం 155 నుంచి 160 క్యూసెక్కులు మాత్రమే చేరేది. కాలువలో కొంత భాగంలో పూడిక తొలగించాక ప్రస్తుతం 175 నుంచి 180 క్యూసెక్కుల మధ్య నీటి ప్రవాహం పెరిగింది.

వచ్చే నెలాఖరులోగా పనులు పూర్తి

పూడిక తీత పనులు జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. పనుల్లో నాణ్యతాప్రమణాలు పాటిస్తున్నాం. గతంలో అధ్వానంగా ఉండే కాలువ ఇప్పుడు శుభ్రంగా కనిపిస్తోంది.

– నానాజీ, జేఈ ఏలేరు కాలువ